RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, జూలై 10, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 75 | పేజీలు: 8 | వెల : రూ.1



### బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

# తులం బంగారం హామీపై ఇంకెన్నాళ్లు

హైదరాబాద్, జూలై 9, (వాయిస్‌టుడే) : తెలంగాణ ప్రభుత్వం పథకాల అమలు విషయంలో ఇప్పటికే ఎన్నో విమర్శలు ఎదుర్కొటోంది. దానికి తోడు ప్రజలకు ఇస్తామని ప్రకటించిన తులం బంగారం హామీకి ఇప్పుడు తిలోదకాలు ఇచ్చారు. కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా పెళ్లికి తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారు. ఈ పథకంపై పెళ్లిళ్లు చేసుకుంటున్న వారు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఆయితే దాన్ని ఇవ్వలేమని బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాము హామీ ఇచ్చినప్పుడు రూ.యాభై వేలు ఉన్న బంగారం ధర ఇప్పుడు లక్ష దాటిందని అందుకే ఆ ఖర్చును ప్రభుత్వం భరించలేదని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు తులా బంగారం ఇస్తామని ప్రచారం చేసింది, కానీ అధికారంలోకి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ "ఇవ్వలేము" అని చెప్పడం విపక్షాలకు ఆయుధంగా మారింది. "ఎన్నికల సమయంలో 'బంగారం' ఇస్తామని చెప్పి, పాలిత తర్వాత 'బడ్జెట్ లేకపోతుంది' అనడం మోసం" అంటూ దీ=గా నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు 'ప్రాక్టికల్ కాదు' అంటూ తప్పించుకోవడం మహిళలను మోసంమ చేయడం అనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తెలంగాణలో పెళ్లి సమయంలో మహిళలకు ఆర్థిక సహాయం అవసరమని కల్యాణ లక్ష్మి పథకం రూపొందింది. పేద కుటుంబాల్లో పెళ్లి ఖర్చులు 5-10 లక్షలకు చేరుకుంటాయి.. ఈ ఖర్చులో బంగారానికి ఎక్కువ వాటా. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా తులం బంగారం ఇస్తే ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. కానీ ప్రభుత్వం తమకు ఆర్థిక భారమని తప్పించుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి నేతలు ఇప్పటికే విమర్శలు ప్రారంభించారు. "కాంగ్రెస్ ఎన్నికల ముందు 'బంగారం' చెప్పి, ఇప్పుడు 'ఇవ్వలేము'.. మహిళలను మోసం చేస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. మహిళల పథకాలు 'పేపర్ ప్రామిస్‌లు' మాత్రమే" అని విమర్శిస్తున్నారు. మంత్రి



పొన్నం ప్రభాకర్ ప్రకటన తర్వాత తీవ్రమైన విమర్శలు వస్తున్నా ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో మహిళల్ని విపరీతంగా ఆకర్షించిన అంశాల్లో తులం బంగారం పథకం కూడా ఒకటి. ఆ పథకం ప్రకటన వల్ల మహిళల ఓట్లు పెద్ద ఎత్తున పడి ఉంటాయని అంచనాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ పథకాన్ని ఇవ్వలేమంటే ప్రజలు ముఖ్యమంగా

(మిగతా 2వ పేజీలో)



# ఆ ముగ్గురికి ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు

హైదరాబాద్ జూలై 9, (వాయిస్‌టుడే) : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ఎస్ పార్టీని వెంటాడుతూనే ఉంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, రోజుకో మలుపు తిరుగుతూ చివరకు పార్టీ అగ్రనాయకత్వం వైపునకు దూసుకువస్తోంది. తాజాగా ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తీసుకున్న ఒక కీలక నిర్ణయం బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్య నేతలను నిందితులుగా చేరుస్తూ సిట్ తుది నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తోంది. ఈ అక్రమ వ్యవహారానికి సంబంధించిన దర్యాప్తును దాదాపుగా కొలిక్కి తెచ్చిన సిట్, నిందితుల జాబితాలో కొత్తగా ఈ ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యులను చేరుస్తూ సప్లిమెంటరీ చార్జ్‌షీట్ సిద్ధం చేసింది. దీనిపై ఇప్పటికే న్యాయ నిపుణుల ఆమోదం కూడా లభించినట్లు తెలుస్తోంది. సాధారణంగా కేసుల విచారణ మధ్యలో కొత్త నిందితులను చేర్చాల్సి వచ్చినప్పుడు న్యాయస్థానంలో మెమో దాఖలు చేయడం ఒక పద్ధతి. సిట్ కూడా ముందస్తు జాగ్రత్తగా ఈ అభియోగపత్రంతో పాటే కోర్టులో మెమో దాఖలు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంది. సాంకేతికపరమైన అనుమతులు కూడా లభించడంతో, ఈ ముగ్గురిపై అధికారికంగా చట్టపరమైన చర్యలు

(మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత: కేటీఆర్

### హైదరాబాద్ నేతల సమావేశంలో వ్యాఖ్యలు.. SIRపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచన

హైదరాబాద్, జూలై 10 (వాయిస్ టుడే): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రస్తుతం ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ప్రజాభిమానం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జీహెచ్‌ఎంసీ పరిధికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, సీనియర్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేతో పాటు ఇతర ప్రజాభిప్రాయ సేకరణల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ సుమారు 78 అసెంబ్లీ స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశముందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలు, డిక్లరేషన్లు, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం, రైతుబంధు వంటి అంశాలపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

**SIRపై ప్రత్యేక దృష్టి**

జీహెచ్‌ఎంసీ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా పార్టీ నియమించిన బూత్ లెవెల్ అసిస్టెంట్లు (BLAs) క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. అలాగే డబుల్ ఓట్లు, నకిలీ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గమనిక: ఈ కథనంలో పేర్కొన్న సర్వే ఫలితాలు, ఆరోపణలు, అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన రాజకీయ ప్రకటనలు మాత్రమే. వీటిని స్వతంత్రంగా ధృవీకరించలేదు.

## ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

### సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ 5.6 గిగావాట్ల సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం



హైదరాబాద్, జూలై 10 (వాయిస్ టుడే): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్యరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్ పరిధిలోని 2,100 చదరపు కిలోమీటర్ల కోర్ అర్బన్ ప్రాంతంలో సుమారు 1.35 కోట్ల జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్య, పట్టణాభివృద్ధి సమస్యల నుంచి హైదరాబాద్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీడిమెట్ల, బాలానగర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం, మూసీ నది కాలుష్యం నగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్న సీఎం, అందుకే ఓఆర్ఆర్ లోపల కాలుష్యకారక పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించేందుకు ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. ఓఆర్ఆర్ వెలుపల ఉన్న పెరి అర్బన్ ఎకానమీ ప్రాంతాన్ని

(మిగతా 2వ పేజీలో)



## సోలార్ ఫెన్సింగ్‌తో పంటలకు రక్షణ

నల్గొండ, జూలై 9, (వాయిస్‌టుడే) : ఒకప్పుడు కోతులు, అడవి పందుల గుంపులు ఆ గ్రామాల్లోని రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసేవి. కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అడవి పందులు, కోతులు పొలాలపై పడి ధ్వంసం చేసేవి. ఈ విధ్వంసం కారణంగా పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కానీ ఇప్పుడు ఆ రైతులకు వన్యప్రాణుల బెడద పూర్తిగా తొలగిపోయింది. సౌర విద్యుత్ కంచె సాంకేతికత వారి పంటలను కంటికి రెప్పలా కాపాడుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 30 మంది రైతులు సాధించిన

(మిగతా 2వ పేజీలో)

## మూసీ రివర్‌ఫ్రంట్ ఫేజ్--1 పనుల పురోగతిపై చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజూ సమీక్ష

### దీర్ఘకాలిక సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన



హైదరాబాద్, జూలై 10 (వాయిస్ టుడే): రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సంజయ్ జాజూ శుక్రవారం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఫేజ్--1 పరిధిలోని పలు కీలక ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌సాగర్, నర్సింగి ఎస్‌టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) స్థలం, గాంధీ సరోవర్ ప్రాజెక్టు భూములను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర నదీ పునరుజ్జీవనం, పట్టణ స్థిరాభివృద్ధి కార్యక్రమంలో ఇవి కీలక భాగాలని అధికారులు వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో ఎంఆర్‌డీసీఎల్ (MRDCL) మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (HMWSSB) మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో చీఫ్ సెక్రటరీ సమగ్ర సమీక్ష

(మిగతా 2వ పేజీలో)



## ఎల్‌నీనో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూలై 10 (వాయిస్ టుడే న్యూస్):లి ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. భారత వాతావరణ శాఖ (IMD) విడుదల చేసే వర్షపాతం అంచనాలు, హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు
శుక్రవారం, జూలై 10, 2026

# సోలార్ ఫెన్సింగ్‌తో పంటలకు రక్షణ



ఉమ్మడి విజయమిది. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు, స్థానిక స్వచ్ఛంద సంస్థల ఉమ్మడి ఆర్థిక, సాంకేతిక సహకారంతో వారు తమ పొలాల చుట్టూ ఈ సౌరకంచెలను ఏర్పాటు చేసుకున్నారు.జిల్లాలోని తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో కోతులు, అడవి పందుల దాడితో రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్న తరుణంలో పిలుపు అనే స్వచ్ఛంద సంస్థ ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించింది. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న దుస్థితిని సవివరంగా నాబార్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సానుకూలంగా స్పందించిన నాబార్డు అధికారులు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొచ్చారు. ప్రాథమికంగా ప్రయోగాత్మక దశలో నలుగురు రైతులను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. ఒక ఎకరా భూమి చుట్టూ సౌరవిద్యుత్ కంచె ఏర్పాటు చేయడానికి మొత్తం రూ.30 వేలు ఖర్చు కాగా.. అందులో రూ.19 వేల మొత్తాన్ని నాబార్డు గ్రాంటుగా అందించింది. మిగిలిన రూ.11 వేల మొత్తాన్ని రైతులు తమ వాటా కింద భరించారు. రైతులకు కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా సోలార్ ప్యానెల్, బ్యాటరీ, ప్రత్యేక తీగలను కొనుగోలు చేసి ఇచ్చి వాటిని ఎలా నిర్వహించాలో శిక్షణ కూడా ఇచ్చారు.మొదటి విడత ప్రయోగం విజయవంతం కావడంతో.. ఆర్డీఎస్ఎస్, ఏబీడీ వంటి ఇతర స్వచ్ఛంద సంస్థలు దాతల సహాయంతో ముందుకు వచ్చాయి. వీటి సహకారంతో మరో 26 మంది రైతులు తమ పొలాలకు సౌరకంచెలను నిర్మించుకున్నారు. దీంతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 30కి చేరింది. గత యాసంగి సీజన్‌లో ఈ కంచెల రక్షణలో రైతులు ధైర్యంగా కూరగాయలు, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. గత ఏడాది వన్యప్రాణుల దాడితో దెబ్బతిన్న అదే పొలాలు, ఈ ఏడాది పచ్చని పంటలతో, ఆశించిన ఫలసాయంతో కళకళలాడుతున్నాయి. తాము పండించిన పంట ఒక్క గింజ కూడా వృథా కాకుండా పూర్తిగా చేతికి దక్కుతోందని చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం తమ పొలాలకు వచ్చి ఈ సోలార్ కంచె పనితీరును ఆశ్చర్యంగా చూసి వెళ్తున్నారని కర్లగండ్ల తండాకు చెందిన మహిళారైతు గుగులోతు శోభ ఆనందం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వన్యప్రాణుల సమస్య తీవ్రంగా ఉంది. కోతులు, అడవి పందులు వంటి జంతువుల కారణంగా రాష్ట్రంలో ఏటా దాదాపు 5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలకు భారీ నష్టం వాటిల్లుతోందని అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న, శనగ, వేరుసెనగ, చెరకు, జొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు, కందులు, పెసలు, రకరకాల కూరగాయల తోటలు, పండ్ల తోటలు ఈ జంతువుల దాడికి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. కేవలం పంటల నష్టమే కాకుండా.. పంటలను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్న రైతులపై ఇవి గుంపులుగా దాడులు చేస్తున్నాయి. ఈ తరహా దాడుల వల్ల గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో 40 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.ఈ సౌర విద్యుత్ కంచె సాంకేతికత అత్యంత సురక్షితమైనది. పొలం చుట్టూ అమర్చిన తీగలను కోతులు, అడవి పందులు తాకగానే తక్కువ తీవ్రత కలిగిన విద్యుత్ షాక్ తగిలి అవి దూరంగా పారిపోతాయి. అదే సమయంలో పొలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలారం మోగటం వల్ల జంతువులు భయపడి ఆ పరిసరాల్లోకి రావడానికే సాహసించడం లేదు. ఈ వ్యవస్థలు పగటితో పాటు రాత్రి వేళల్లోనూ సమర్థవంతంగా పనిచేస్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా.. ఈ కంచెల ద్వారా వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణహాని జరగదు, కేవలం అవి భయపడి దూరంగా వెళ్తాయి. గతంలో రాత్రంతా నిద్ర లేకుండా కాపలా కాసే రైతులు ఇప్పుడు కంటినిండా నిద్రపోతున్నారు. ఈ విధానం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఒక ప్రత్యేక సోలార్ ఫెన్సింగ్ పాలసీని తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

**బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత**

**ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ**

**ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య**



బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన ‘సింగరేణి బాయి బాట’ కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. “ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. “కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం” అని స్పష్టం చేశారు.

# కడియం శ్రీహరిది కపటబుద్ధి.. నా శాఖను హైజాక్ చేశారు: కొండా సురేఖ

**పీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు.. కడియంపై చర్యలు కోరిన మంత్రి**

**తనకు తెలియకుండా తన దేవాదాయ శాఖలో సమీక్ష నిర్వహించారని ఫిర్యాదు**

**సీఎం, మీనాక్షి నటరాజన్ దృష్టికీ తీసుకెళ్లినట్లు వెల్లడి**

**ఎదుటివాళ్ల ఎదుగుదలను కడియం ఓర్వలేరని విమర్శ**



మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. మరోవైపు కడియం–సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# హైదరాబాద్‌లో వరంగల్ దంపతుల ఆత్మహత్య.. మత మార్పిడి ఒత్తిడే కారణమా?

**హైదరాబాద్‌లో రైలు కిందపడి వరంగల్ దంపతుల ఆత్మహత్య**

**పొరుగువారు రూ.20 లక్షలు మోసం చేశారని ఆరోపణలు**

**మతం మారాలంటూ ఒత్తిడి చేశారని కుమారుడి ఫిర్యాదు**

**ఆత్మహత్యకు ప్రేరేపించారన్న కోణంలో పోలీసుల దర్యాప్తు**



ఆర్థిక వివాదాలు, మతం మారాలంటూ పొరుగువారి నుంచి ఎదురైన తీవ్ర ఒత్తిడి కారణంగా ఓ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఈ జంట, తమ ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ జూలై 2న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు వదిలారు. క్రైస్తవ మతంలోకి మారాలని పొరుగువారు తమ తల్లిదండ్రులను బలవంతం చేశారని, ఆ వేధింపులే వారి ఆత్మహత్యకు దారితీశాయని వారి 14 ఏళ్ల కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన రవికుమార్, శిరీష దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసు వచ్చి, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. బియ్యం వ్యాపారం చేసే రవికుమార్‌కు పొరుగున ఉండే వెంకట్, ప్రమీలతో పరిచయం ఏర్పడింది. రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు రూ.20,000 ఆదాయం వస్తుందని వారు నమ్మించారు. వారి మాటలు నమ్మిన రవికుమార్, తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి సుమారు రూ.20 లక్షల వరకు వారికి అందజేశారు. అయితే, నిందితులు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే నగదు చెల్లించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో రవికుమార్ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే సమయంలో మతం మార్చుకోవాలంటూ వెంకట్, ప్రమీల తమపై ఒత్తిడి తెచ్చారని, చర్చికి రావాలని నిరంతరం వేధించేవారని వారి కుమారుడు సుశాంత్ పోలీసులకు తెలిపాడు. ఈ వేధింపులు భరించలేక వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడానికి కూడా సిద్ధపడ్డారు. జూలై 2న ఆత్మహత్యకు పాల్పడకముందు రవికుమార్ దంపతులు వెంకట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా రికార్డులు ద్వారా స్పష్టమవుతోంది. ఘటనానంతరం పరారైన వెంకట్, ప్రమీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, తదుపరి విచారణలో భాగంగా దానిని ఆత్మహత్యకు ప్రేరేపణ (సెక్షన్ 108) కింద మార్చి దర్యాప్తు చేపట్టారు. మత మార్పిడి ఆరోపణలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను వరంగల్‌లోని బంధువుల వద్దకు చేర్చారు.

## తులం బంగారం హామీపై ఇంకెన్నాళ్లు

మహిళలు అసంతృప్తికి గురవుతారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ‘కల్యాణ లక్ష్మి పథకం’ పెళ్లి సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ముఖ్యమైన స్కీమ్. SC/ST/BC/EWS/ మైనారిటీలకు చెందిన అమ్మాయిల పెళ్లికి రూ. 1,00,116 సహాయం ఇస్తుంది. 2014లో కేసీఆర్ హయాంలో ప్రారంభమయింది. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లి ఖర్చులు తగ్గించడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2014 నుంచి 10 లక్షలకు అమ్మాయిలకు పెళ్లిళ్లకు సాయం చేశారు. ఈ పథకానికి మరింత వాల్యూ యాడ్ చేసి ఓట్లు సంపాదించాలనుకున్న కాంగ్రెస్.. తులం బంగారం ప్రకటన చేసి ఇరుక్కుపోయింది. ఇప్పుడు పథకం ఇవ్వకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిలయినట్లే అవుతుంది.

## ఆ ముగ్గురికి ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు

ముందుకు పడనున్నాయి.సిట్ దర్యాప్తులో తేలిన గణాంకాలు, తేదీలు ఈ కేసు తీవ్రతను కళ్ళకు కడుతున్నాయి. ముఖ్యంగా 2023 నవంబరు 15 నుంచి నవంబరు 30వ తేదీ వరకు కేవలం 15 రోజుల వ్యవధిలోనే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా ఈ ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత ఉధృతంగా సాగినట్లు సిట్ గుర్తించింది. ఈ స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 4,013 మందిపై నిఘా ఉంచినట్లు దర్యాప్తులో తేలింది. వీరిలో 618 మందికి సంబంధించిన ఫోన్ సంభాషణలను అత్యంత అక్రమ పద్ధతిలో వినేందుకు ఎస్ఐబీ ప్రయత్నించిందని ఆధారాలతో సహా నిరూపితమైంది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల వ్యూహాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ భారీ ట్యాపింగ్ నెట్‌వర్క్ పనిచేసిందని స్పష్టమవుతోంది.ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ సీహెచ్ఓ టి.ప్రభాకర్ రావు నియామకం వెనుక ఉన్న మతలబులను సిట్ మొదటి నుంచీ అనుమానిస్తూనే ఉంది. విచారణలో భాగంగా ప్రభాకర్ రావు ఇచ్చిన సమాచారంతో పాటు, గత ప్రభుత్వంలో కీలక విభాగాల్లో పనిచేసిన ఉన్నతాధికారుల వాంగ్మూలాలు బీఆర్ఎస్ ముఖ్యులకు ఉచ్చుగా మారాయి. గత ప్రభుత్వంలో సీఎంఓ, హోంశాఖలో పనిచేసిన ఉన్నతాధికారుల నుంచి సిట్ ఇటీవలే కీలక వాంగ్మూలాలను సేకరించింది. తమపై ఉన్నతాధికారులు, రాజకీయ పెద్దల ఒత్తిడి వల్లే, వారి ఆదేశాల మేరకే తాము పనిచేయాల్సి వచ్చిందని పోలీసు ఉన్నతాధికారులు ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒక మాజీ డీజీపీతో పాటు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన ఒక ఉన్నతాధికారి ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల పాత్రపై సిట్ స్పష్టమైన ఆధారాలు సేకరించగలిగింది.అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ ముగ్గురు నేతల పాత్ర ఏమిటనేది సిట్ తన అభియోగపత్రంలో క్షుణ్ణంగా పొందుపరిచింది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీకి అందిన ఎలక్టోరల్ బాండ్ల విషయంలో, నిధుల సమీకరణలో అక్రమ నిఘా ఏ విధంగా ఉపయోగపడిందనే కోణంలో ఒక ప్రముఖుడి పాత్రపై గట్టి ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. ఎవరిపై అక్రమంగా నిఘా ఉంచాలి, ఎవరి డేటా సేకరించాలి అనే విషయాలపై నేరుగా ఆదేశాలు ఇచ్చిన వారిపై సిట్ ఆధారాలను క్రోడీకరించింది. అయితే, ఇదే కేసులో గతంలో విచారణను ఎదుర్కొన్న ఒక కీలక మాజీ ప్రజాప్రతినిధికి మాత్రం ఈ అభియోగపత్రంలో ఉపశమనం లభించినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనను విచారించినప్పటికీ, ప్రస్తుతానికి ఆయన పేరును నిందితుల జాబితాలో చేర్చలేదని సమాచారం.మొత్తంగా చూస్తే, ఒకప్పుడు కేవలం అధికారుల చుట్టూనే తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు, ఇప్పుడు నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతల గుమ్మం తొక్కడం ఆ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బేనని చెప్పవచ్చు. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న పక్కా ఆధారాలు, అధికారుల వాంగ్మూలాల నేపథ్యంలో ఈ ఫోన్ ట్యాపింగ్ భూతం బీఆర్ఎస్ పార్టీని రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా వెంటాడటం ఖాయంగా కనిపిస్తోంది.

## ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

ప్రత్యేక తయారీ (మాన్యుఫాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేసి, తరలించే పరిశ్రమలకు అక్కడ అవసరమైన భూములను కేటాయిస్తామని వెల్లడించారు. పెరి అర్బన్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో తొలి పరిశ్రమగా ప్రిమియర్ ఎనర్జీస్ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని, కేవలం 12 నెలల్లోనే ఈ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేయడం సంస్థ ప్రతిభకు నిదర్శనమని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిమియర్ ఎనర్జీస్ అభివృద్ధి చేసిన సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, గాలి శుద్ధి వ్యవస్థ కలిగిన “సోలార్ ఆక్సీ ట్రీ”ని ముఖ్యమంత్రి పరిశీలించారు. పునరుత్పాదక ఇంధనంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సాంకేతికతలను అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. “తెలంగాణ రైజింగ్--2047” విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ అభివృద్ధి మండళ్లుగా రూపొందించి, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వివరించారు. యువతకు వైట్ కాలర్ ఉద్యోగాలతో పాటు బ్లూ కాలర్ రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలలు, స్కిల్స్ యూనివర్సిటీ వంటి సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రిమియర్ ఎనర్జీస్ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మూసీ రివర్‌ఫ్రంట్ ఫేజ్-1 పనుల పురోగతిపై చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజూ సమీక్ష

నిర్వహించారు. వరద నియంత్రణ చర్యలు, మురుగునీటి శుద్ధి వ్యవస్థ సమన్వయం, భూఅభివృద్ధి, రివర్‌ఫ్రంట్ కారిడార్ మౌలిక వసతుల ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు దీర్ఘకాలికంగా సుస్థిరంగా కొనసాగేందుకు, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని సంజయ్ జాజూ సూచించారు. శాఖల మధ్య సమన్వయం, శాస్త్రీయ ప్రణాళిక, పర్యావరణ, సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మూసీ, ఈసా నదుల మధ్య ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ సంగమం వరకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎంఆర్‌డీసీఎల్, హెచ్‌ఎండీఏలకు సూచించారు. దీంతో మెరుగైన అనుసంధానం, సుస్థిర పట్టణాభివృద్ధితో పాటు రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. చీఫ్ సెక్రటరీ సూచనలను ప్రాజెక్టు అమలులో పొందుపరిచి, ఫేజ్--1 పనులను మరింత వేగవంతం చేస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు.

## ఎల్‌నీనో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: మంత్రి ఉత్తమ్

ఎల్‌నీనో పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయ కార్యాచరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షించి, వాటికి అనుగుణంగా పంటల ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, గ్రామసభలు, రైతు వేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వాతావరణ, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేసి శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా రైతులకు చేరవేయాలని మంత్రి పేర్కొన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలపై పారదర్శక సమాచారం అందించి, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 10 జూలై 2026



## నూతన బిషప్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన దాస్యం

కాజీపేట, జూలై9 (వాయిస్ టుడే): కాజీపేట (వరంగల్) ఫాతిమా బృహదేవాలయ ప్రాంగణంలో వరంగల్ మేత్రాసన (డియోసిస్) నూతన పీఠాధిపతిగా నియామకమైన మోన్సిగ్నోర్ దుగ్గింపుడి విజయపాల్ ను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సాయంత్రం ఫాతిమా చర్చి ప్రాంగణంలో కలిసి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బిషప్ జ్ఞానం, కరుణ, సేవాతత్పరత సమాజ అభివృద్ధికి, శాంతికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నూతన బిషప్ ఆధ్వర్యంలో సమాజానికి మరిన్ని ఆధ్యాత్మిక సేవలు జనులకు అందుతాయని తెలిపారు విశ్వాసికులకు, దైవజనులకు మరింత మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ అనుకిరణ్, పెద్దలు నారాయణ రెడ్డి, ఇమ్మడి రాజు, జాన్సన్, అజయ్, జోసఫ్, థామీ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి: పీడీఎస్‌యూ

వరంగల్, జూలై 9 (వాయిస్ టుడే న్యూస్): విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జూలై 10న విద్యార్థి సంఘాలు చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వరంగల్ జిల్లా కార్యవర్గం పిలుపునిచ్చింది. గురువారం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొమ్ముక రవి, జిల్లా కార్యదర్శి అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హేమంత్, సన్నీ, శ్రవణ్, సాయి, కుమార్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## సురేందర్‌బాబు జ్ఞాపకార్థం మొక్కలు నాటిన బి.ఆర్.ఎస్.నాయకురాలు పాటూరి స్వప్న మురళీధర్

హైదరాబాద్:జూలై 09;( వాయిస్ టూ డే): సురేందర్ బాబు జ్ఞాపకార్థం బి.ఆర్.ఎస్.నాయకురాలు పాటూరి స్వప్న మురళీధర్ నల్లకుంటలో మొక్కలు నాటే పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణానికి పరిరక్షించే విధంగా మొక్కలు నాటి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వంటి సమస్యలకు మొక్కలు నాటడమే ఏకైక పరిష్కారం తెలిపారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. పుట్టినరోజులు, వర్ధంతులు వంటి సందర్భాలలో వృధా ఖర్చులు చేయకుండా ఇలా మొక్కలు నాటి సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరితసేన అంబర్పేట నియోజకవర్గం అధ్యక్షులు నిరంజన్ పూలే,హరితసేన గోల్నాక డివిజన్ అధ్యక్షులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నల్ల నరేష్ ,కరుణాకర్, నాగుల శ్రీకాంత్,నగేష్, పాల్,శ్రీలత,మహేశ్వరి, వనిత, శైలజ పాల్గొన్నారు.



## "అమరం కృష్ణారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: బండి రమేష్"

కూకట్ పల్లి : జులై 9(వాయిస్ టుడే): బేగంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి గురువారం పరమపదించారు. ఈ విషాద వార్త తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి కృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాస్ రెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, అమరం కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో ఎన్నో సంవత్సరాల పాటు సేవలందించిన సీనియర్ నాయకుడని అన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన విశిష్ట సేవలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. దివంగత అమరం కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్, కరుణాకర్, విశాల్, భరత్, ఆలీ, సుజిత్ గౌడ్, అరుణ్, సురేష్, రమాదేవి, సురేష్ బాబు, అభిషేక్ తదితరులు పాల్గొని అమరం కృష్ణారెడ్డి కి ఘన నివాళులర్పించారు.

# పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే నంబర్-1గా తీర్చిదిద్దుతాం..

**రూ.21 కోట్లతో 172 దుకాణాల నిర్మాణం వేగవంతం..**

**మేకల మండి, చేపల మార్కెట్, స్లాటర్ హౌస్, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ..**

**అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : వ్యవసాయం, వాణిజ్యం, ఉపాధి రంగాలకు కొత్త ఊపిరి పోస్తూ పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రాష్ట్రంలోనే అత్యాధునిక, ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో మార్కెట్ యార్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గురువారం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించి, నిర్ణీత గడువులోగా అత్యుత్తమ ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో 12 సంవత్సరాల క్రితం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

ప్రస్తుతం 21 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 172 దుకాణాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని తెలిపారు. పనులు పూర్తయ్యాక లైసెన్స్ కలిగిన వ్యాపారులకు దుకాణాలను కేటాయించడంతో పాటు కొత్త వ్యాపారులకు కూడా లైసెన్సులు మంజూరు చేసి వ్యాపార విస్తరణకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌కు పన్నులు, కిరాయిలు, టెండర్ల ద్వారా ఏటా సుమారు రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతోందని, దీనిని మరింత పెంచేందుకు కొత్త ఆదాయ వనరులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులో ఆధునిక మేకల మండి, చేపల మార్కెట్, అత్యాధునిక స్లాటర్ హౌస్, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే రోజువారీ కూరగాయల విక్రయాలు నిర్వహించే చిరు వ్యాపారులకు ప్రత్యేక షెడ్లు నిర్మించి మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

మార్కెట్‌లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి పరిశుభ్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు మార్కెట్ స్వంత ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే అత్యుత్తమ, ఆదర్శవంతమైన, నంబర్-1 మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కార్యదర్శి సునీల్, మాజీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీ దుర్గాభవాని మాత ఆలయం 16వ వార్షికోత్సవ మహోత్సవాలు

**అభిషేకం, హోమం, మహా హారతి, అన్నప్రసాద వితరణలో వందలాది మంది భక్తుల కొలహలం**



సికింద్రాబాద్ : జులై 9(వాయిస్ టుడే) సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్ట్ జీఈ (యుటిలిటీ) కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీ దుర్గాభవాని మాత ఆలయం 16వ వార్షికోత్సవ మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు అమ్మవారికి పవిత్ర అభిషేకం నిర్వహించగా, అనంతరం ఉదయం 7 గంటలకు హోమం, ఉదయం 8.30 గంటలకు మహా హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. వార్షికోత్సవ మహోత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీ దుర్గాభవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో జీఈ (యుటిలిటీ) మేజర్ దేవేందర్ సింగ్‌తో పాటు సీడబ్ల్యూ ఆర్మీ--1, ఆర్మీ--2, జీఈ సౌత్, జీఈ నార్త్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఓటర్ ఐడీ వివరాల ధృవీకరణలో సేవలు అందిస్తున్న -బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):ఓటర్ ఐడీ వివరాల ధృవీకరణలో సేవలు అందిస్తున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్. గురువారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ లో శ్రీ అపార్ట్‌మెంట్స్, అమృత ఎన్‌క్లేవ్, ఆశిష్ ఎన్‌క్లేవ్ పలు ప్రాంతాల్లో బిఎల్ఓ అఖిల తో కలిసి పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఎన్యూమరేషన్ పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.



# గీతంలో బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్) కోర్సు

**బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో ప్రారంభం**

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఒక వినూత్నమైన బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్) కోర్సును 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ కోర్సు విద్యార్థులకు అద్భుతమైన విద్యా నైపుణ్యం, ఆచరణాత్మక వ్యాపార నిర్మాణ అనుభవాలను అందించి, వారిని భవిష్యత్ పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు, వ్యాపార నాయకులుగా తీర్చిదిద్దేలా రూపొందించామన్నారు.

ఈ నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు, ఫైనాన్స్, మార్కెటింగ్, స్ట్రాటజీ, ఆపరేషన్స్, అనలిటిక్స్, మేనేజ్ మెంట్ వంటి ప్రధాన వ్యాపార విభాగాలను, వెంచర్ క్రియేషన్ లో అనుభవపూర్వక అభ్యాసంతో అనుసంధానిస్తుందని తెలిపారు. స్టార్టప్ ల్యాబ్ లు, వ్యవస్థాపకులతో ముఖాముఖి, ఇన్నోవేషన్ స్టూడియోలు, కేస్ స్టడీస్, కస్టమర్ డిస్కవరీ, వెంచర్ డెవలప్ మెంట్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతారని వివరించారు.

హైదరాబాదులోని టి-హబ్‌లో ఉన్న బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ద్వారా పరిశ్రమతో ఈ కార్యక్రమానికి బలమైన అనుసంధానం ఉండటం దీనిలోని ఒక ముఖ్యమైన విశేషంగా అభివర్ణించారు. విద్యార్థులకు మార్గదర్శులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, భారతదేశంలోని అత్యంత చైతన్యవంతమైన వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలలో ఒకదానికి అనుసంధానమవుతారని తెలిపారు. బ్లూమ్ బెర్గ్ సర్టిఫికేషన్, ఇన్నోవేషన్ ల్యాబులు, ప్రోటోటైపు ఫండింగ్ అవకాశాలు, మొదటి ఏడాది నుంచే స్టార్టప్ ఇంటర్న్ షిప్పులు, ఇంకా యాక్సిలరేటర్లు, పిచ్ పోటీలలో పాల్గొనడం వంటివి అభ్యాస అనుభవాన్ని మరింతగా పెంచుతాయన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉన్న ఈ పాఠ్య ప్రణాళిక, 162 క్రెడిట్ల ఫ్రేమ్ వర్కుతో ఎనిమిది సెమిస్టర్ల పాటు కొనసాగుతుందని, ఇందులో ప్రత్యేకమైన వెంచన్ ల్యాబులు కూడా ఉన్నాయని వివరించారు. ఇవి విద్యార్థులకు ఆలోచన దశ, వ్యాపార ధ్రువీకరణ, నిధుల సమీకరణ, విస్తరణ, వెంచర్ వృద్ధి వరకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు.

ఈ కోర్సు పూర్తిచేసిన వారు స్టార్టప్ వ్యవస్థాపకులు, వెంచర్ డెవలప్ మెంట్ మేనేజర్లు, ఇన్నోవేషన్ మేనేజర్లు, ప్రొడక్ట్ మేనేజర్లు, బిజినెస్ డెవలప్ మెంట్ నిపుణులు, వెంచర్ క్యాపిటల్ విశ్లేషకులు, యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ మేనేజర్లు, కుటుంబ వ్యాపార నాయకులు, సామాజిక పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ ఇన్నోవేటర్లు వంటి విభిన్న కెరీర్ అవకాశాలకు సిద్ధమవుతారని స్పష్టీకరించారు. ఈ కోర్సు పారిశ్రామికత, నిర్వహణ, ఆవిష్కరణ రంగాలలో ఉన్నత విద్యకు బలమైన పునాదిని కూడా కల్పిస్తుందన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ లేదా 10o2లో కనీసం 50 శాతం మార్కులు సాధించి, గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026)లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలను (స్కాలర్ షిప్) గీతం అందిస్తుందన్నారు.

మరింత సమాచారం కోసం గీతం వెబ్ సైట్ www.gitam.eduను సందర్శించాలని, లేదా సందీప్ రావళ్ల (87120 18804), వై.శ్రీనివాస్ (87120 18805) లను సంప్రదించాలని సూచించారు.

# పటాన్చెరు నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వెంటనే ప్రారంభించాలి

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎం .నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు బి .నాగేశ్వరరావులు డిమాండ్



పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : పటాన్చెరు నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వెంటనే ప్రారంభించేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎం .నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు బి .నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట లక్డారం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కార్యాలయ ఆర్ ఐ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, నాగేశ్వరరావు మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో వామపక్షాల పోరాట ఫలితంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాన్ని ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వస్తున్నావా మున్సిపల్ లో విలీనమైన అనే కారణంతో పటాన్చెరు నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల నుండి ఉపాధి హామీ పథకాన్ని నిలిపివేయడం జరిగిందని అన్నారు. లక్డారం,పెద్దకంచెర్ల, చిన్న కంజర్ల, బచ్చు గూడెం గ్రామాలు, జిన్నారం, గుమ్మడిదల మండలాలలో ఉపాధిహామీ పథకంలో పనిచేయడానికి వందలాది మంది కూలీలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎంతోమంది కూలీలకు పనులు లేక అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. పనులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటూ, నిత్యవసర సరుకుల గ్యాస్, పెట్రోలు ధరలుపెరగడం మరింత భారంగా తయారైందని అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వి బి జి రామ్ జి పథకం పేరుతో కొత్త పలుకులు పలుకుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును తొలగించి, ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకుండా, ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్నదని అన్నారు. గతంలో విజయవంతమైన ఉపాధి హామీ పథకాన్ని ఎంతోమంది కూలీలు పథకం లోపల హాజరై విజయవంతంగా కొనసాగించారని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం రెండు దఫాల ఫోటో క్యాప్చర్ విధానాన్ని తీసుకువచ్చి ఉపాధి హామీ కూలీలకు, మేటీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇలాంటి చర్యలతో ఉపాధి హామీ పథకాన్ని నీరు కార్చడమేనని అన్నారు. ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని పాత పద్ధతిలోనే పనులను కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో కూలీల డిమాండ్ ఉన్న అన్ని గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామీణ స్థాయి నుంచి పెద్ద ఎత్తున ఆందోళన తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లకడారం గ్రామస్తులు ఏ. పోచయ్య, షేక్ జబీన్,జ్యోతి, మానెమ్మ, బూదమ్మ, గొల్ల మంజుల, పై మీద, సంగమ్మ, ఆంజనేయులు ఇతర గ్రామ కూలీలు పాల్గొన్నారు.

## ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

### జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాలతో ప్రత్యేక బృందం ఏర్పాటు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 09: నిర్మల్ జిల్లా నిర్మల్ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టనుంది. ప్రత్యేకంగా నిర్మల్ బస్టాండ్ పరిసరాలు, ఆటో స్టాండ్, అంబేద్కర్ చౌక్, మయూరి హోటల్ సమీపం, కిసాన్ షాపింగ్ మాల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, రహదారులపై వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారులతో చర్చించి ట్రాఫిక్ సజావుగా సాగేలా అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. అలాగే రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నివారించి వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఆర్ఐలు రామ్ నిరంజన్, రామక్రిష్ణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం రేపటి నుంచి అమల్లోకి వస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, రహదారులను ఆక్రమించకుండా సహకరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.



## వ్యక్తి నిర్మాణమే జాతీయ పునర్నిర్మాణానికి పునాది

### -- కమల్ సురేష్(ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కో- కన్వీనర్

నాచారం (వాయిస్ టుడే):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర శాఖ ఆధ్వర్యంలో 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాలలో "వ్యక్తి నిర్మాణమే జాతీయ పునర్నిర్మాణం" అనే అంశంపై సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏబీవీపీ ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్ కమల్ సురేష్ మాట్లాడుతూ, వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు విలువలు, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తితో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో యువతకు 21 సంవత్సరాల వయస్సులో ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలకు తగ్గించాలని జరిగిన ఉద్యమాల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. యువతకు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించేందుకు ఏబీవీపీ నిరంతరం కృషి చేసిందని తెలిపారు.

అలాగే, జమ్మూ--కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 అంశంపై జాతీయ సమైక్యత కోసం ఏబీవీపీ దీర్ఘకాలంగా ఉద్యమించిందని, కాశ్మీర్‌లో జాతీయ జెండా గౌరవాన్ని నిలబెట్టేందుకు అనేక మంది ఏబీవీపీ కార్యకర్తలు త్యాగాలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా సంస్కరణలు, జాతీయ చైతన్యం, సేవా కార్యక్రమాలు మరియు సమాజ నిర్మాణంలో నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. స్వామి వివేకానంద ఆశయాలను ఆచరిస్తూ యువత జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్, మహానగర కార్యవర్గ సభ్యురాలు సింధూరి, విభాగ్ ఖేలో కన్వీనర్ సుప్రజ్, నగర ఖేలో కన్వీనర్ రాహుల్, రఘునందన్, రాంప్రసాద్,ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే) జూలై 09: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 2026 జూలై 17వ తేదీ నుండి నిర్వహించనున్న శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికలను నేడు స్థానిక శాసనసభ్యులు శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడే ఆధ్యాత్మిక వేడుకలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని ఆకాంక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా, వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని పుణ్యఫలాన్ని పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కె. వైశాలి, కె . నాగరాజు, జి . గోపీనాథ్, డి. లక్ష్మమ్మ ప్రత్యేక ఆహ్వానితులు సి. శైలజ, ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎన్.ఆర్. కృష్ణారెడ్డి , ఏఈఓ హేమమాలిని , పర్యవేక్షకులు శ్రీ హరి , ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి , ఆలయ పర్యవేక్షకులు సి. నాగభూషణం యాదవ్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి , ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ ఐ ఆర్ (SIR)పై మానికేశ్వర్ నగర్ లో అవగాహన

నాచారం (వాయిస్ టుడే):కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై గురువారం మానికేశ్వర్ నగర్ లో తార్నాక డివిజన్ టిడిపి అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీూా లతో కలిసి బస్తీలో ఇంటింటికి వెళ్ళుతూ ఓటర్లను కలిసి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఎన్యుమరేషన్ ఫారంలో 2002 నాటి ఓటర్ లిస్టు తో ప్రస్తుత వివరాలను మ్యాపింగ్ చేయడంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బి ర్ స్ నాయకులు ఖ.కృష్ణ రాయలు , బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వి.చింటూ ,లక్మన్ ,స్థానిక నాయకులు పరమేశ్ , నాసర్ , పవన్, నవీన్ లు బిఎల్ఓ లు పాల్గొన్నారు.



## నిర్మల్ పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ దగ్గర కోతుల పట్టివేత కార్యక్రమం విజయవంతం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)జూలై09: నిర్మల్ జిల్లా నిర్మల్ పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ దగ్గర నిర్వహించిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమంలో మొత్తం 51 కోతులను పట్టుకొని కవ్వాల్ అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.పట్టుబడిన కోతులకు రంగులు చల్లి కవ్వాల్ అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వినీషా లక్ష్మి తార మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## కేబీ హోమియోకేర్ హాస్పిటల్ ప్రారంభించిన నిర్మల్ డిసిసి,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జులై 09 నిర్మల్ : నిర్మల్ పట్టణ కేంద్రంలో నూతన కేబీ హోమియోకేర్ హాస్పిటల్ ప్రారంభించిన నిర్మల్ డిసిసి అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ,రిబ్బన్ కట్ చేసి,హాస్పిటల్ బృందానికి మరియు డాక్టర్స్ కి శుభాకాంక్షలు తెలిపారు,నిర్మల్ జిల్లా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో హోమియోకేర్ ఏర్పాటు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్స్‌కి శాలువాతో సన్మానించారు,ఎమ్మెల్యే కి హాస్పిటల్ యాజమాన్యం శాలువాతో సన్మానించి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్ఐ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి ఖానాపూర్ ఎమ్మెల్యే

### ఎన్యూమరేషన్ ఫార్మ్ బిల ఓలకి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ వెడ్మ బొజ్జు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)జూలై 09 ఖానాపూర్ : ఖానాపూర్ కేంద్రంలోని మున్సిపల్ 11వ వార్డ్ లో స్ ఐ ర్ సర్వేలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఎన్యూమరేషన్ ఫార్మ్ నీ పరిశీలించారు,సర్వే పకడ్బందీగా నిర్వహించాలని,ఎన్యూమరేషన్ ఫార్మ్ బి ల ఓ లకి జాగ్రత్తగా ఫిల్ చేసి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ,ఓటు హక్కు తోనే సమాజంలో మార్పు,ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అన్నారు.జాగ్రతగా సర్వే నిర్వహించాలి అని బి ల ఓ లకి అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు,అధికారులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఎస్. ఐ. ఆర్. ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలి

### బోగస్ ఓట్ల తొలగింపుకు ఇదే మంచి అవకాశం

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 09: ఎస్ఆర్ఐ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాల వారిగా అందరి ఓట్లు నమోదు చేయించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. గురువారం బైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సర్ ప్రక్రియపై బిజెపి నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీయులు దేశంలో చొరబడకుండా, ఉండటానికి సర్ ఎంతోగానో దోహదం చేస్తుందని భోగస్ ఓట్ల తొలగింపుకు ఇది మంచి అవకాశం అన్నారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఎస్. ఐ. ఆర్. లో గ్రామాల వారిగా బిఎల్వోలకు బిజెపి బిఎల్ఏ లు సహకరించాలన్నారు. భైంసా తో పాటు కుబీర్, ముధోల్, తానుర్, బాసర మండల కేంద్రంల్లో పెద్ద మొత్తంలో భోగస్ ఓట్లు ఉన్నాయని ఎస్. ఐ. ఆర్. తో అంతా తేటతెల్లమవుతుందన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే, అధికారులను సంప్రదించాలని, అర్హులైన వారి ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత బిజెపి నాయకులు కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు రితిష్ రాథోడ్ మాట్లాడుతూ సర్ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలని, సర్ తో పశ్చిమ బెంగాల్ లో 90 లక్షల బోగస్ ఓట్లు తొలగించబడ్డ విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం పెద్ద మొత్తంలో బోగస్ ఓట్లు ఉన్నాయని, దేశం కోసం ధర్మం కోసం, నాయకులు కార్యకర్తలు అంతా కంకణ బద్దులై సర్ కు సహకరించాల్సిందిగా సూచించారు.. కార్యక్రమంలో బిజెపి ఎస్. ఐ. ఆర్. జిల్లా ఇంచార్జి రావుల రాంనాథ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, ముధోల్ నియోజకవర్గ బిజెపి సర్ ఇంచార్జ్ పైడి పల్లి గంగాధర్,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, ఏనుపోతుల మల్లేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు రావుల రాము, బిజెపి మండలాల అధ్యక్షులు, సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో అంగరంగ వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే) జూలై 09: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో నేడు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం భక్తుల విశేష ఆదరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విద్యారంభానికి అత్యంత శుభప్రదమైన ఈ కార్యక్రమంలో వందలాది మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొని శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి ఆశీర్వదించారు. విద్యారంభాన్ని దైవసన్నిధిలో ప్రారంభించడం భారతీయ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయమని, చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కె. వైశాలి, కె . నాగరాజు, జి . గోపీనాథ్, డి. లక్ష్మమ్మ ప్రత్యేక ఆహ్వానితులు సి. శైలజ, ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎన్.ఆర్. కృష్ణారెడ్డి ,ఏ ఈ ఓ హేమమాలిని , పర్యవేక్షకులు హరి , ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి , ఆలయ పర్యవేక్షకులు సి. నాగభూషణం యాదవ్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి , ప్రోటోకాల్ ఏ ఈ ఓ లోకేష్ బాబు , అనుబంధ ఆలయాల ఛైర్మన్ లు బోర్డు సభ్యులు మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు , దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు దేవస్థానం కల్పించిన ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేస్తూ, చిన్నారులకు దైవసన్నిధిలో అక్షరాభ్యాసం నిర్వహించే అవకాశం కల్పించిన దేవస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు.




## సోన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 09: నిర్మల్ జిల్లా సోన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ ఈరోజు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ రిజిస్టర్లు, మాల్ఖానా, ఆయుధాగారం, లాకప్, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, ఇతర పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్టేషన్ రైటర్లు, సీసీటీఎన్ఎస్ సిబ్బంది పనితీరును జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తున్న తీరుపై ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ తో పాటు, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,సోన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై లు గోపి,హనుమాన్లు, శ్రావణి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించిన పూర్వ విద్యార్థి

నాగార్జునసాగర్/ పోతునూరు జులై 9 వాయిస్ టుడే: పెద్దవూర మండలంలోని పోతునూరు గ్రామంలోని ప్రభుత్వప్రాథమికోన్నత పాఠశాల, పూర్వ విద్యార్థి మేడారపు సత్యనారాయణ రూ.4,000 విలువైన రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెండ్యాల సంతోష్ రావు మాట్లాడుతూ, గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతుల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫారాలు, రుచికరమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నందున గ్రామ ప్రజలందరూ తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడిత్య వెంకట్రామ్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా ఎంపికై, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి మానసిక వికాసం, నైతిక విలువల పెంపొందనకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సీలింగ్ ఫ్యాన్ల దాత మేడారపు సత్యనారాయణ మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా పాఠశాల అవసరాలకు తన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేహాజాబి, గులాం అంజాద్, అంజుమ్ ఆరా, ధర్మారెడ్డి, అనిత పాల్గొన్నారు.

# జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం

**సీఎం రేవంత్ రెడ్డి రాకతో మధిర నియోజకవర్గంలో రాజకీయ, రైతాంగ వర్గాల్లో ఉత్సాహం**

**వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థుల సమీకరణకు విస్తృత ఏర్పాట్లు..**

**ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి రైతులు, కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపు**



వెంకటాపురం, జూలై 9 (వాయిస్ టుడే) : చింతకాని మండలం జగన్నాథపురంలో జూలై 10న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సభను విజయవంతం చేయాలని ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గత నెల 30న మధిర నియోజకవర్గంలో జరగాల్సిన సభ భారీ వర్షాల కారణంగా వాయిదా పడగా, అదే సభను ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లో రూ.9,000 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి ప్రజాపాలనలో మరో మైలురాయిని నెలకొల్పిందని తెలిపారు. ఈ సంక్షేమ కార్యక్రమాలను రైతులకు వివరించేందుకు నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభకు ప్రతి రైతు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, పార్టీ అభిమాని తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. వెంకటాపురం గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను సభకు తరలించే ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు, మహిళలు, యువత, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ విజయవంతానికి అవసరమైన రవాణా, సమీకరణ, సమన్వయ కార్యక్రమాలను స్థానిక నాయకులు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు అనుకూల కార్యక్రమాలకు ప్రజల మద్దతు మరింత బలపడేలా రైతులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి అని బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, టీపీసీసీ నాయకులు శీలం ప్రతాప్ రెడ్డి, మాజీ భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆయులూరి వెంకటేశ్వర రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు శీలం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీనివాసరావు, యన్నం పిచ్చిరెడ్డి, కంచర్ల వెంకట నరసయ్య, గూడేటి బాబురావు, జిల్లా సెక్రటరీ సగ్గుర్తి వెంకట నారాయణ, మండల సీనియర్ నాయకులు అనుమోలు వెంకట కృష్ణారావు, సముద్రాల పురుషోత్తం, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ, పెగళ్లపాడు సర్పంచ్ కాకర్లమూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ పునర్నిర్మాణం ఏబీవీపీ లక్ష్యం

### ABVP జాతీయ కార్యవర్గ సభ్యులు బోడ. లక్ష్మణ్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 09: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఽాదీఽా నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నగరంలో విద్యార్థులతో కలిసి స్థానిక వివేకానంద స్టాచ్యూ వద్ద జెండా ఆవిష్కరించడం జరిగింది.లిఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు బోడ.లక్ష్మణ్‌లి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని 5 మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వం తో ప్రపంచములోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయిఅని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దు కై నినదించి ఉద్యమించి విజయం సాధించిన ఘనత ఎబివిపి దని, అక్రమ వలసదారుల ఏరివేతకు సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో అని అక్రమ వలసదారుల వల్ల ఏర్పడే జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని, తెలంగాణ, బెంగాల్, కేరళ మరియు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నరహంతక నక్సలైట్ల తూటాలకు ఎదురించి, జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని, అటువంటి మహా వీరులు పుట్టిన గడ్డ తెలంగాణ. జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థులను తెలియచేయడంలో ఎబివిపి కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూ వస్తున్నారు. నేడు జహీరాబాద్ లో ఇక్కడ కాగడా జండా పట్టుకొని భారత్ మాతాకి జై అని నినదిస్తున్న ఈ వేలాదిగా విచ్చేసిన విద్యార్థుల సంఖ్య వారి ఉచ్ఛాహం సాక్ష్యం అని వామపక్ష వాదుల వ్యక్తి నిర్మూల సిద్ధతం నేడు భారత పటంలో శాశ్వతంగా నిర్మూలింపబడిందని, జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెలో ప్రతి ఇంటిలో విస్తరించిందని అన్నారు, భారత దేశంను ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుటకు ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎబివిపి నిర్మల్ జిల్లా కన్వీనర్ దినేష్,నితీష్, వంశీ, అభి,సాయి చరణ్, కార్తీక్, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ నమోదును విజయవంతం చేయాలి : జిల్లాకలెక్టర్




నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 09: నిర్మల్ జిల్లా కలెక్టర్ భావిష్ మిశ్రా గురువారం తాండూరు మండలంలోని సింగం గావ్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులు ఆదేశించారు. ఎస్సార్ సర్వే ను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామంలో 100% ఓటర్ నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మహేందర్ నాథ్ తదితరులు కలెక్టర్ తో ఉన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మహేందర్ నాథ్ జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

**బీఎల్ఏలకు గుర్తింపు కార్డుల పంపిణీ చేసిన వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ..**

**ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచన**



వైరా (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) సూచించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన ఆయన, తిమ్మారావుపేట గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియలో పాటించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. బాదావత్ బాలాజీ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశమని అన్నారు. బీఎల్ఏలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయం చేసుకుంటూ పేర్లు, చిరునామాలు, అర్హతలు తదితర వివరాలను సరిచూసి అవసరమైన సవరణలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా, అనర్హులు చేర్చబడకుండా అత్యంత అప్రమత్తంగా పనిచేయాలి. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి ప్రతి కుటుంబానికి చేరువ కావడం బీఎల్ఏల బాధ్యత అని బాదావత్ బాలాజీ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించడంతో పాటు ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని ఆయన సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్య బాలాజీ, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అలియా, బీఎన్ లాల్, చల్లా కోటేశ్వరరావు, భూక్య శ్రీను, భూక్య భీమ, ధరావత్ రాములు తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్య అధికారి శ్రీనివాసులు



మహబూబ్నగర్ జిల్లా జూలై 9 (వాయిస్ టుడే) : జడ్చర్ల /నవాబు పేట్; మహబూబ్నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు నవాబు పేట్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు తనిఖీలో భాగంగా రోగులకు ఆస్పత్రిలో అందుతున్న వైద్య కోసం వచ్చిన రోగులను ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు ప్రాథమిక ఉప కేంద్రాన్ని సందర్శించి బాలింతను పరామర్శించి పిల్లలకు సరైన సమయంలో టీకాలు అందించాలని సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అందరూ చురుకుగా సేవలు అందించాలని ఫీవర్ సర్వేను ప్రతి సోమ మంగళ గురు శుక్రవారాలు నిర్వహించాలని డాక్టర్ శ్రావణ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ సూచనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, శ్రీనివాసులు, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా చేపట్టాలి

**జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి**




ఝురాసంగం జూలై 09(వాయిస్ టుడే) : జహీరాబాద్ మండలంలోని గోవింద్ పూర్ గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై గురువారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ళ నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి ఏజెంట్లు బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, 2002 ఓటర్ల డేటా మ్యాపింగ్ మరియు సవరణలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ ఇమామ్ పటేల్, సీనియర్ నాయకులు నర్సింహులు,జుబేర్ పటేల్,దిలీప్ కుమార్, గోపాల్,అంజన్న,వీరన్న మరియు బీఎల్వోలు, బీఎల్ఏలతో పాటు పలువురు గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుర్దిపహాడ్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ

## యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యం

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





ఝురాసంగం జూలై 10 (వాయిస్ టుడే) : జహీరాబాద్ మండలంలోని బుర్దిపహాడ్ గ్రామంలో ఆధునిక ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణానికి గురువారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్, టీఎంఆర్‌ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫాహీం ఖురేషీ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా జహీరాబాద్ నియోజకవర్గ యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కూడా ఈ కేంద్రం ద్వారా విస్తరించనున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం ఆధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి రావడం వల్ల వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనుస్, సీడీసీ చైర్మన్ ముబీన్, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, ఉదయశంకర్ పాటిల్, పవన్ రాథోడ్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, ముజాఫ్ఫర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్షద్, సామెల్, మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కాంగ్రెస్ నాయకుడు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి, బుర్దిపహాడ్ గ్రామ సర్పంచ్ మల్లికార్జున్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, యువతతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## బీరప్ప ఆలయ నిర్మాణానికి ఉప సర్పంచ్ బైండ్ల రాములు 50 వేల ఆర్థిక సాయం

మహబూబ్నగర్ జిల్లా జులై 9 (వాయిస్ టుడే) : జడ్చర్ల /నవాబుపేట మండలంలోని కూచూరు గ్రామంలో కురువ (కుర్వ) కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం గ్రామ ఉప సర్పంచ్ బైండ్ల రాములు రూ.50,000ల భారీ విరాళాన్ని అందజేసి తన భక్తి, సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కురుమ (కుర్వ) కుల పెద్దలు, యువకులు, భక్తులు ఆయనను ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూచూరు గ్రామంలో కురుమ (కుర్వ) కులస్తులు అధిక సంఖ్యలో నివసిస్తూ తరతరాలుగా శ్రీ బీరప్ప స్వామిని తమ ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. బీరప్ప స్వామి గ్రామ ప్రజలకు రక్షకుడిగా, పశుసంపదను కాపాడువాడిగా, కుటుంబాలకు సుఖశాంతులు ప్రసాదించే దైవంగా ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. ఈ విశ్వాసంతో భక్తులు ఆలయ నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విరాళాల సేకరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ బైండ్ల రాములు మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బీరప్ప ఆలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయం పూర్తయితే గ్రామానికి ఆధ్యాత్మిక వైభవంతో పాటు ప్రత్యేక శోభ చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు ఇది ఒక గొప్ప వారసత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కురుమ (కుర్వ) సంఘం సభ్యులు ఉప బైండ్ల సర్పంచ్ రాములకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేజీబీవీలో అధ్యాపకురాలి నియామకానికి దరఖాస్తు

### ప్రత్యేక అధికారిణి సునీత



మాడ్గులపల్లి: జూలై 9 (వాయిస్ టుడే): మాడ్గులపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పీజీసీఆర్‌టీ తాత్కాలికపద్ధతిన అధ్యాపకురాలి నియామకానికి ఒకపోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని కేజీబీవీ మాడ్గులపల్లి ప్రత్యేక అధికారిణి సునీతతెలిపారు. స్థానికంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్‌సి, బాటనీ, బిఎడ్, టెట్, విద్యాఅర్హత కలిగిన అర్హులైనమహిళా అభ్యర్థులు ఈ నెల 10 లోపు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో కలిపి దరఖాస్తు చేసుకొని మాడ్గులపల్లి మండల కేంద్రంలోని కేజీబీవిలో దరఖాస్తు ప్రతులనుసమర్పించాలని ఆమెకోరారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా మెరిట్, ప్రాతిపదికన నిర్వహించ బడుతుందనిప్రత్యేకఅధికారిణిసునీతతెలిపారు.



## బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుల అరెస్టు

### గవర్నర్‌ను కలిసేందుకు వెళ్తుండగా అరెస్ట్

### మైనార్టీల స్థలాన్ని తిరిగి మైనార్టీలకు కేటాయించాలని డిమాండ్

హనుమకొండ, జూలై 9(వాయిస్ టుడే): హనుమకొండ జిల్లాలో గవర్నర్ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుల అరెస్టు చేశారు. మైనార్టీ శాదీఖానా భవన నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 25 గుంటల స్థలం కేటాయించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్థలాన్ని తిరిగి తీసుకున్నదని వారు ఆరోపించారు. నిరసనగా కొంతకాలంగా ప్రభుత్వ అధికారులను కలుస్తూ వినతిపత్రాలు అందించిన ఫలితం శూన్యం అని, ఈ నేపథ్యంలో గవర్నర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి వెళ్తున్న సమయంలో పోలీసులు తమను అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటు నినాదాలు చేశారు. మైనారిటీ లకు కేటాయించిన స్థలాన్ని తిరిగి మైనారిటీ లకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో నయిమొద్దీన్, మసూద్, మహమూద్, జుబేర్, తౌసిఫ్, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

## గవర్నర్ మరియు మంత్రికి స్వాగతం పలికిన ఎంపీ డాక్టర్ కావ్య

### గవర్నర్ మరియు మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, సీపీ, అధికారులు, ప్రజాప్రతినిధులు



కాజీపేట, జూలై 9(వాయిస్ టుడే): వరంగల్ పర్యటనలో భాగంగా నిట్ కళాశాలకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆయనకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. అనంతరం గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమై వరంగల్ ప్రాంత అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు కూడా ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. గవర్నర్ మరియు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామి రెడ్డి, హనుమకొండ కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పోలీస్ కమీషనర్ ఎన్. శ్వేతా రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.



## పేద విద్యార్థులకు అండగా ఉంటా..

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

కాజీపేట, జూలై 9(వాయిస్ టుడే): పేద విద్యార్థులకు విద్యతో పాటు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం, తాను అండగా ఉంటామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. గత ఆదివారం మడికొండలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ ను ఆకస్మకంగా తనిఖీ చేసిన సందర్భంలో విద్యార్థులు అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పడంతో ఎమ్మెల్యే స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పాత బియ్యాన్ని మార్చి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయించారు. పేదింటి విద్యార్థులకు నిరంతరం అండగా ఉంటామన్నారు.



## మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌నగర్ కాలనీ సచివాలయాలను సందర్శించారు.

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే) జూలై 09: మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌నగర్ కాలనీ--02 మరియు 03 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర పునశ్చరణ--2026 --2026) కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ, నమోదు, ధృవీకరణ ప్రక్రియలను పరిశీలించి, కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశమై, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని సూచించారు.

అలాగే సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలనను కచ్చితంగా పాటిస్తూ, కార్యాలయానికి వచ్చే ప్రతి పౌరుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, పారదర్శకత, బాధ్యతాయుత సేవా దృక్పథంతో ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసి, ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన సూచించారు.



## మానవత్వం చాటుకున్న కుడా చైర్మన్ ఇనగాల

### రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి రూ. 1,00,116 విరాళం అందజేత

### గవర్నర్ మరియు మంత్రి లక్ష్మణ్ సమక్షంలో చెక్కు అందజేత

### మనసున్న మహారాజు అంటు పలువురి ప్రశంస

హనుమకొండ జూలై9 (వాయిస్ టుడే) : హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి, అక్కడ చికిత్స పొందుతున్న తలసేమియా బాధితుల వైద్య సేవల నిమిత్తం హనుమకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తమ మానవత్వం చాటుకున్నారు. ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 1,00,116/- (అక్షరాలా లక్షా నూట పదహారు రూపాయలు) వారు విరాళంగా అందజేశారు. గురువారం హనుమకొండ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పరిధిలోని బ్లడ్ బ్యాంక్, తలసేమియా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, బ్లడ్ బ్యాంక్‌లోని రక్త నిల్వలు మరియు సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇతర మానవతా సేవా కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గవర్నర్ మరియు మంత్రి వర్యుల సమక్షంలో విరాళానికి సంబంధించిన చెక్కును రెడ్ క్రాస్ ప్రతినిధులకు బహూకరించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో రక్తం కొరతతో, తలసేమియా లాంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు, నిరుపేదలకు రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న మానవతా సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, వైద్య సేవలను విస్తరించేందుకు తమ వంతు బాధ్యతగా ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ విరాళం అందించినట్లు తెలిపారు. కొద్దిరోజులుగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న చిన్నారులను చూసి చలించిపోయిన ఇనగాల గవర్నర్ సమక్షంలో విరాళం ఇవ్వడంతో అక్కడున్నవారంత 'మనసున్న గొప్ప మహారాజు' అంటూ ఇనగాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు మరియు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకం ఆవిష్కరించిన గవర్నర్

### హనుమకొండ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

### రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





హనుమకొండ, సుబేదారి (వాయిస్ టుడే): తలసీమియా బాధితుల తల్లిదండ్రుల కోసం పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం రెడ్ క్రాస్ భవనంలో తలసీమియా బాధితుల కుటుంబ సభ్యుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్‌పై తలసీమియా పేరెంట్స్ లాంజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు చాహత్ బాజ్‌పాయ్, పాలకవర్గ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు బ్యాండ్‌తో గౌరవ వందనం అందించారు. అనంతరం గవర్నర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి తలసీమియా సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. తదుపరి రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను పాలకవర్గ సభ్యులు గవర్నర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ రక్తదాన సేవలతో పాటు ఆరోగ్య, మానవతా సేవల్లో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్చిస్తానని గవర్నర్ తెలిపారు. తలసీమియా బాధితులకు సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ పాలకవర్గం తరపున గవర్నర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, కుడా మాజీ చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ ఎం. శేషుమాధవ్, డాక్టర్ కె. సుధాకర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బిళ్ల రమణారెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 10 జూలై 2026



## కొనసాగుతున్న సర్ నమోదు ప్రక్రియ

తొర్రూరు, జులై 9 వాయిస్ టుడే : గత ఆరు రోజులుగా తొర్రూరు పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారమ్స్ నింపడం జరుగుతుందని బీఎల్ఓ మోతే శంకర్ తెలిపారు. గురువారం11 వ వార్డు పరిధిలోని పలు గృహాలను సందర్శించి ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కలగజేస్తూ ఓటు హక్కు నమోదుపై వారికి వివరించడం జరిగిందన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల సాంకేతికవిద్యకు ఇన్ఫోసిస్ చేయూత
## 80 కంప్యూటర్ల విరాళం

తొర్రూరు, జులై 9 వాయిస్ టుడే : గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఇన్ఫోసిస్ హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సంయుక్త ఆధ్వర్యంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 80 కంప్యూటర్ల విరాళం అందజేసే కార్యక్రమం తొర్రూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కంప్యూటర్ల విరాళ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కంప్యూటర్లను ఇన్ఫోసిస్ హైదరాబాద్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా అందించగా, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ సత్యనారాయణ మూర్తి, తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తునం శ్రవణ్ విశిష్ట అతిథులుగా హాజరై, ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొంటూ ఇన్ఫోసిస్, లయన్స్ క్లబ్‌ను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయాలనే ఈ మహత్తర కార్యక్రమానికి ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతి , సిఎస్ఆర్ కోఆర్డినేటర్ రాపాక నాగరాజు విశేష కృషి చేసి కంప్యూటర్లను సమకూర్చారు. వారి సేవలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ వసతులు పెరగడం వల్ల గ్రామీణ విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా అభ్యసించే అవకాశం లభిస్తుందని, తద్వారా వారి ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎన్. కృష్ణమూర్తి, పి. వెంకటేశ్వర్ రెడ్డి, ఎం. రమణ రెడ్డి, ప్రోగ్రామ్ చైర్మన్ టి. ఉపేందర్ రావు, కో–చైర్మన్ గంజి విజయ్‌పాల్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




## పెండింగ్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలి
### టిఆర్వీఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధర సిద్ధూ

తొర్రూరు, జులై 9 వాయిస్ టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్నా 11 వేల కోట్ల స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలో టి ఆర్ వి ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ సంఖ్యలో రోడ్డెక్కి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టి ఆర్ వి ఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధరీ సిద్దు మాట్లాడుతూ టి ఆర్ వి ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో తొర్రూర్ మండలకేంద్రం లోని అన్ని కళాశాల విద్యార్థులతో కలిసి పెండింగ్ లో ఉన్న 11000కోట్ల స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని (టిఆర్ విఎస్ ) తెలంగాణ రాజ్యాధికార విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఈరోజు ధర్నా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని వారు ఆరోపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 వేల కోట్ల స్కాలర్షిప్ మరియూ ఫీజు రీయింబర్స్మెంట్ నీ తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా విద్యాశాఖ మంత్రిని కూడా నియమించాలని కోరారు. రేవంత్ సర్కార్ ఏనాడు కూడా విద్యార్థుల భావుషతుపైనా శ్రద్ధ చుపాడం లెధన్నరు. రాష్ట్ర ప్రభువత్వశీ ఇప్పటికైనా విద్యార్థులకు న్యాయం జరిగేవిధంగ చెరియాలు తిసుకోవలాని అన్నారు. ఇలానే ప్రభుత్వం స్పందించకుండా ఉంటే రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉతికృతం చేస్తామని వారన్నారు ఈ యొక్క ధర్నాలో తొర్రూర్ టీఆర్వీఎస్ మండల అధ్యక్షులు విశ్వాస్, రవి, సాయి, శ్రీకాంత్, మహేష్, గణేష్, ప్రియా, సోనీ, యామిని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## మెడికేర్ హాస్పిటల్ సేవలు అభినందనీయం




తొర్రూరు, జులై 9 వాయిస్ టుడే : గ్రామీణ ప్రాంతాల్లో మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఔతాపురం గ్రామ సర్పంచ్ తోటకూర శ్రీనివాస్ సూచించారు. తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పెద్దవంగర మండలం ఔతాపురం గ్రామంలో గురువారం తొర్రూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యశాల మెడికేర్ హాస్పిటల్ వారి సహకారంతో, బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యం నిర్వహిస్తున్న వైద్య సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మెడికేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నర్కూటి రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో తమ మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో తొర్రూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి, దంతాలపల్లి మండలాల్లో ప్రస్తుత వర్షాకాల సీజన్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని రాము సూచించారు. తమ మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి అత్యవసరకాలంలో ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మెడికేర్ హాస్పిటల్ కు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కోటా నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సూచనలు కనిపించినా ఆలస్యం చేయకుండా వెంటనే పరిధిలోని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్లో ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు గురించి డాక్టర్ నరేష్ ప్రజలకు వివరించారు. ఈ మధ్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రతినిధి బృందం, మెడికేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

తొర్రూరు, జులై 9 వాయిస్ టుడే : జ్ఞానం శీలం ఏకత పరిషత్ ప్రత్యేకత అంటూ క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గం చూపినటువంటి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపి) 78వ్యవస్థాపక దినోత్సవాన్ని తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జరిగింది. గురువారం తొర్రూరు పట్టణంలో స్థానిక దత్తు ఒకేషనల్ జూనియర్ కాలేజి వద్ద ఏబీవీపి తొర్రూరు మండల కన్వీనర్ చిలుక మనోజ్ ఏబీవీపి జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949జులై9న డిల్లీ యూనివర్సిటీ లో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపి నేడు ప్రపంచంలో అతి పెద్ద అత్యంత శక్తివంతమైన విద్యార్థి సంఘం గా ఆవిర్భవించింది అని తెలిపారు. ధేశంలో ఏ విద్యార్థికి కష్టమొచ్చినా,సమస్య ఉన్నా నేనున్నాను అంటూ ముందుండి పోరాడే ఏకైక సంస్థ అని, కేవలం విద్యార్థుల సమస్యలే కాకుండా ధేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, సవాళ్ళను కూడా ఛేదించి జాతి నిర్మాణం కోసం నిస్వార్థంగా కృషి చేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపి అని కొనియాడారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూనే విద్యార్థులలో దేశభక్తిని ప్రభోధం చేస్తూ, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ ధేశం కోసం ధర్మం కోసం నిరంతరం పనిచేస్తున్నది ఏబీవీపి అని తెలిపారు. హస్టల్ విద్యార్థుల సమస్యలపై పోరు, స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ పై పోరుబాట తో పాటుగా తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి అసెంబ్లీ ముట్టడించి విద్యార్థుల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఏబీవీపి కే దక్కింది అని,విద్యర్థులలోదాగియున్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసేవిధంగా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్న సామాజిక సంస్థ ఏబీవీపి అని,ఏబీవీపి ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా ధేశం మొత్తం అనేక కార్యక్రమాలు చేస్తున్నదని,విద్యార్థులు ఏబీవీపి చేపట్టే కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏబీవీపి సీనియర్ నాయకులు పల్లె కుమార్,పైండ్ల రాజేష్, నూకల నవీన్,సాగర్,భంటి, కార్తీక్, ఉమేష్,అరుణ్, శిరీష,అక్షయ, సౌజన్య,కరుణ,మంజుల,అనిత తదితరులు పాల్గొన్నారు.




## సుడా చైర్మన్ పదవి బీసీలకు కేటాయించాలి: దొగ్గలి శ్రీధర్

కరీంనగర్,జూలై 09(వాయిస్ టుడే): శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా ఈసారి బీసీలకే అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ, యువజన సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్,మాదాసు సంజీవ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అని బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉంటామని అని చెప్పిన ప్రభుత్వం కరీంనగర్ కు ప్రతిష్టాత్మకమైన సుడా చైర్మన్ పదవి బీసీలకు అవకాశం ఇవ్వాలని బీసీ సంఘాల పక్షాన కోరుతున్నాం. కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్చార్జిగా బీసీలకు అవకాశం ఇవ్వాలని బీసీ సంఘాల పక్షాన డిమాండ్ చేసిన అధిష్టానంఅగ్రవర్ణాల వారికే కేటాయించింది. 52 శాతం ఉన్న బీసీలకు కరీంనగర్ లోని అన్ని రాజకీయ పార్టీలు గత ఎన్నికలలో టికెట్లు కేటాయించగా ఇక్కడి నుండి బీసీఏ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నాలుగు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా బీసీ గెలుపొందారు. బీసీలలో రాజకీయ చైతన్యం కరీంనగర్ నియోజకవర్గంలో బాగా ఉంది కావున సుడా చైర్మన్ గా బీసీ నేమ్ నియమించాలని బీసీ సంఘాల పక్షాన కోరుతున్నామని తెలిపారు.

## భవన నిర్మాణ బంద్‌కు ఎలక్ట్రీషన్ల మద్దతు
### భవన నిర్మాణ కార్మికుల జేపీసీ పిలుపునకు సంఘీభావం




కరీంనగర్, జులై 09(వాయిస్ టుడే): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం,సంక్షేమ పథకాల అమలు, కార్మికులకు సరైన వేతనాలు కల్పించాలనే డిమాండ్లతో భవన నిర్మాణ కార్మికుల జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపునకు కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. జూలై 9 నుంచి 14వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భవన నిర్మాణ పనులతో పాటు ఎలక్ట్రికల్ పనులను కూడా నిలిపివేస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు లేబర్ కార్డు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణాలు చేపట్టే ఇంటి యజమానులు లేబర్ కార్డు కలిగిన కార్మికులనే పనిలోకి తీసుకోవాలని సూచించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ,సంక్షేమం కోసం జేఏసీ చేపట్టిన బంద్‌కు ప్రతి కార్మికుడు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజబాబు,ఉపాధ్యక్షుడు పాపయ్య, కార్యదర్శి బషీర్,మహేష్,ఖజాంచి నవీన్,ఎగ్జిక్యూటివ్ సభ్యులు అనిల్ రెడ్డి,గంగారెడ్డి,బాడీ మెంబర్లు, ఎలక్ట్రిషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్.బి.ఎస్ ఫంక్షన్ హాల్ నుండి కలెక్టరేట్ వరకు మురుగు నీటి కాలువపై స్లాబ్ నిర్మాణం
### అధికారులకు యాదగిరి సునీల్ రావు ఆదేశాలు

కరీంనగర్, జూలై 09(వాయిస్ టుడే): నగరంలోని ఎస్.బి.ఎస్ ఫంక్షన్ హాల్ నుండి కలెక్టరేట్ వరకు ఉన్న మురుగు నీటి కాలువను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ఇండ్ల మధ్యలో ఉన్న ఈ అతిపెద్ద ఓపెన్ డ్రైన్ వల్ల ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతం అంతా వరద కాలువల వల్ల జలమయం అయ్యేదని ఆయన గుర్తుచేశారు. దీనిని నివారించడానికి సుమారు 22 సంవత్సరాల క్రితం ఈ స్ట్రామ్ వాటర్ డ్రైన్‌ను నిర్మించినట్లు తెలిపారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఇళ్లలోకి నీళ్లు మురుగు రాకుండా,చుట్టుపక్కల ప్రాంతాలు ముంపుకు గురికాకుండా ఈ కాలువ కాపాడుతూ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నిర్మాణం జరిగి 22 ఏళ్లు కావడంతో ఇది చాలా చోట్ల కూలిపోయి శిథిలావస్థకు చేరుకుందని వివరించారు. కరీంనగర్ నగరం నుండి వచ్చే వరద నీటిలో 20 శాతానికి పైగా నీళ్లు ఈ కాలువ గుండానే వెళ్తాయని ఆయన తెలిపారు. గతంలో ఈ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయి ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. కరీంనగర్ నగరంలో ఉన్న నాలుగు మురికి కాల్వలలో ఇది ఒక ప్రధాన మురికి కాలువ. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాలువ పాడైపోయిన చోట పునర్నిర్మాణం చేయడంతో పాటు, అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ నిర్మించి,డ్రైనేజీ మొత్తం కవర్ అయ్యేలా పైభాగంలో స్లాబ్ వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల కాలువ నుండి వచ్చే దుర్వాసన అరికట్టడమే కాకుండా, వర్షాకాలంలో ఎలాంటి ప్రాణాపాయం, ప్రమాదాలు జరగకుండా వరద నీటి ప్రవాహానికి ఇది అత్యంత కీలకమైనది కావడంతో,దీనికి అత్యంతప్రాధాన్యత ఇచ్చి నిర్మిస్తున్నట్లు సునీల్ రావు వెల్లడించారు. ఈ నిర్మాణ పనులకు సంబంధించి తక్షణమే అంచనాలు రూపొందించి,పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. రాబోయే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గట్టు స్వామి, కాలిద్,ఆంజనేయులు,వామన్ రావు, శంకరయ్య,సత్యం,సురేందర్, లక్ష్మణమూర్తి,నారాయణ గౌడ్,కనకయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.



## సొంత ఖర్చులతో ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు

బోయినపల్లి జులై 9 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ తొలి వార్డులో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని గ్రామ ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ–రాజు సొంత ఖర్చులతో అమలు చేసి ఆదర్శంగా నిలిచారు,తొలి వార్డులో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న వీధి వెలుతురు సమస్యను గుర్తించిన ఉపసర్పంచ్ శైలజ–రాజు,ప్రజలు రాత్రి వేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో కొత్త విద్యుత్ స్తంభం (కరెంట్ పోల్) ఏర్పాటు చేయించారు,దీంతో వార్డులోని వీధి వెలుతురు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది,ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో తొలి వార్డు ప్రజలు ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ–రాజుకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యుడు దమ్మ వెంకటరమణతో పాటు తొలి వార్డు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**